


మంగళవారం 16 జూన్ 2026 పేజీలు : 8

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

**బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్, జూన్ 15: కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనలో అభివృద్ధి ఆగిందని, ప్రతి కుటుంబానికి నష్టం జరిగిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని మక్తమాసాన్‌పల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌ల కార్యకర్తలు పలువురు సోమవారం ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధు ఆధ్వర్యంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి యువకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని, రాబోయే రోజుల్లో కేసీఆర్ సారథ్యంలో మళ్లీ తెలంగాణకు మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

# రాయన్‌పల్లి ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలి

- రెండు వారాల్లో పనులు పూర్తికాకపోతే వాననీరు నిల్వ ఉండదు..
- ప్రభుత్వ తీరుతో 2500 ఎకరాల ఆయకట్టుకు నష్టం
- గతేడాది భారీ వర్షాలకు ప్రాజెక్టు అలుగు, తూము, కాల్వలు దెబ్బతిన్నా పట్టించుకో లేదు..
- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు.. స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించాలి



# ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి



- మెగా ప్లాంటేషన్‌కు ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ఆయిల్‌ఫెడ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి
- యాప్‌తో లింక్ లేకుండా రైతులకు యూరియా అందించాలి
- పంట దెబ్బతినకుండా సమయానుకూలంగా నీరు, ఫర్టిలైజర్ అందించాలి

**సిద్దిపేట**

ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించాలని, రైతులకు అవగాహన కలిపించాలని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఆయిల్ ఫెడ్, హార్టికల్చర్ అధికారులతో ఆయిల్‌పామ్ సాగుపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలోనే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశామన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 1600 మంది రైతులు 4,800 ఎకరాల్లో సాగు చేశారని, ఈ ఏడాది సిద్దిపేట నియోజకవర్గంలో మరో 2 వేల ఎకరాల సాగు లక్ష్యంగా పనిచేయాలన్నారు. మెగా ప్లాంటేషన్‌కు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆయిల్‌ఫెడ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండటం లేదని తన దృష్టికి వచ్చిందని, యాప్‌తో లింక్ లేకుండా ఆయిల్‌పామ్ రైతులకు యూరియా అందించాలని ఆదేశించారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- సంగారెడ్డి మహిళా పోలీసు స్టేషన్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ
- స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్, స్టేషన్ రికార్డుల నిర్వహణపై సమీక్ష
- మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్



**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)**

సంగారెడ్డి మహిళా పోలీసు స్టేషన్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్., ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్, స్టేషన్ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితిగతులను పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను సమీక్షించిన ఎస్పీ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి, - మిగతా5లో

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)జూన్ 15:-** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎలాంటి జాప్యం చేయరాదని చెప్పారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌లో 31, సంగారెడ్డి డివిజన్‌కు 15, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 10, జహీరాబాద్ డివిజన్‌లో 6 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చదువుల పండుగకు శ్రీకారం చుట్టిన

# నస్తీపూర్ ప్రాథమిక పాఠశాల

**హత్నూర 15జూన్ (ప్రజాజ్యోతి)**





మండల పరిధిలో ని నాస్తిపూర్ గ్రామంలో సోమవారం నాడు నూతన విద్యాసంవత్సరం 2026--2027 ప్రారంభం సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పూలతో, మిఠాయిలతో ఆహ్వానం పలికి విద్యా సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో స్వాగతం ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ ప్రమీల సాయిలు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకనాధం మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ పాఠశాలల లక్ష్యమని, నైపుణ్యాధారిత విద్యతో పాటు విలువలతో కూడిన బోధన అందిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ బృందం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదయ్య ,ఉపాధ్యాయులు నరేష్ , ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు ,విద్యా వాలంటీర్ ప్రవలిక ,విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలుగా సువర్ణ మల్లన్న పాటిల్



**జహీరాబాద్, జూన్ 15( ప్రజా జ్యోతి న్యూస్)** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ (డిసిసి) అధ్యక్షురాలు నిర్మాల జగ్గారెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుల పేర్లను విడుదల చేశారు. జహీరాబాద్ నియోజకవర్గం లోని కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా సువర్ణ మల్లన్న పాటిల్ ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జహీరాబాద్ ఎంపి.సురేష్ కుమార్ షేట్కార్, డిసిసి అధ్యక్షురాలు నిర్మాల జగ్గారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ గిరిదర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి, మాజి జడ్పీటీసీ రాందాస్, నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను మండలం లోని ప్రతి గ్రామంలో ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని సువర్ణ మల్లన్న పాటిల్ తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సువర్ణ మల్లన్న పాటిల్ ను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారి సంఖ్యలో పాల్గొని శాలువ, పూల దండలతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారి సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



**జహీరాబాద్, జూన్ 15(ప్రజా జ్యోతి న్యూస్)** జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా ఆధ్వర్యంలో ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు భట్టి విక్రమార్క మల్లు నిరంతర ప్రజా పోరాట యోధుడు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా, సోమవారం హైదరాబాద్, ప్రజా భవన్ లోని నివాసంలో ఆయనను కలిసి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కటింగ్ చేసి నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి రాజకీయా ల్లోకి అడుగుపెట్టి తన కృషి, నిజాయితీ, ప్రజాసేవ పట్ల అంకిత భావంతో తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు భట్టి విక్రమార్క అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నాలుగు దశాబ్దాలకుపైగా ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడి గా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషుల తరపున అస్మా ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రశంసించడమే కాకుండా, ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రజావాణి కార్యక్రమం.

ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ.

ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి సత్వర న్యాయం అందించాలని అధికారులకు ఆదేశాలు.

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.





**సంగారెడ్డి (ప్రజా జ్యోతి):** ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్., ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకొని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో తమ సమస్యలు పరిష్కారం దొరకనప్పుడు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షి స్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటు న్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

# త్రాగునీటి సమస్య పరిష్కరించాలి

## -అమీన్‌పూర్ మున్సిపల్ అధికారులకు వాణినగర్ కాలనీవాసుల వినతి

**అమీన్‌పూర్(ప్రజాజ్యోతి)** వాణినగర్ కాలనీ రోడ్ నంబర్--4లో నెలకొన్న తీవ్ర త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు అమీన్‌పూర్ మున్సిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో గత కొంతకాలంగా త్రాగునీటి సరఫరా సక్రమంగా జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. తగిన ఒత్తిడితో నీరు రాకపోవడంతో పలువురు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో నీటి అవసరాలు పెరిగిన నేపథ్యంలో సమస్య మరింత తీవ్రమైందని తెలిపారు. అదేవిధంగా కాలనీలోని కొన్ని ప్రాంతాలకు తాగునీటి పైపులైన్లు పాతబడిపోవడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయని, వాటి కారణంగా నీటి వృథా జరుగుతోందని వివరించారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పైపులైన్ లు మరమ్మతులు చేపట్టడంతో పాటు నీటి సరఫరా సమయాలను పెంచాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు మాట్లాడుతూ ప్రజలకు కనీస అవసరమైన త్రాగునీటిని అందించడం స్థానిక సంస్థల బాధ్యత అని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నాగేశ్వరరావు, హనుమంతు రెడ్డి, శ్రీనివాసరావు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## అమావాస్య సందర్భంగా శ్రీ వీరభద్రేశ్వర ఆలయంలో భక్తుల సందడి



**రాయికోడ్ జూన్ 15 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని శ్రీ వీరభద్రేశ్వర ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం భక్తులు అగ్నిగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి, అనంతరం శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కళకళలాడగా, శివనామ స్మరణలు, భజనలు, మంగళవాయిద్యాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన వేలాది మంది భక్తులకు ప్రసాదంతో పాటు అన్నదానం అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన సేవను విజయవంతం చేశారు.కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు తాగునీరు, క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీ తదితర ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ అమావాస్య రోజున శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారిని దర్శించుకోవడం విశేష పుణ్యఫలాన్ని అందిస్తుందని, తమ కోరికలు నెరవేరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. భక్తుల రద్దీ మధ్య అమావాస్య వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి.

## పాఠ్యపుస్తకాల పంపిణీ



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూన్ 15:** నారాయణఖేడ్ మండలం హన్మంతరావుపేట్ ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు పుండ్లిక్, సంజీవ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు అందించిన పుస్తకాలను సక్రమంగా వినియోగించుకొని విద్యాభ్యాసంలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమైన తొలి రోజే పాఠ్యపుస్తకాలు అందించడం వల్ల విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను కొనసాగించే అవకాశం కలుగుతుందని తెలిపారు. విద్యార్థులు కొత్త పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ కుమార్, వెంకట్రావు, భగవాన్ దాస్, దేవి సింగ్, శ్రీకాంత్, శైలజ, నీరజ, పి.డి. విజయకుమార్, శివరాం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీజీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్ టిక్కెట్ బుకింగ్‌కు ఏజెంట్లకు ఆహ్వానం



నిజాంపేట్, శంకరంపేట్ (ఎ) మరియు జోగిపేట ప్రాంతాలలో టీజీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్ బస్సు టిక్కెట్ల బుకింగ్ నిర్వహించేందుకు ఏజెంట్లను ఆహ్వానిస్తున్నట్లు నారాయణఖేడ్ డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..నారాయణఖేడ్, సంగారెడ్డి, జహీరాబాద్ మరియు హైదరాబాద్ నుండి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఆన్‌లైన్ బస్సు టిక్కెట్ బుకింగ్ సేవలు అందించేందుకు ఆసక్తి గల వారు మరిన్ని వివరాల కోసం నారాయణఖేడ్ డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రయాణికు లకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఉపాధి అవకాశాన్ని కూడా పొందవచ్చని తెలిపారు.

## తెలంగాణ మోడల్ స్కూల్‌లో పీజీటీ గణిత ఉపాధ్యాయ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు



**అందోలు, జూన్ 15 (ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పోతులబోగుడలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో పీజీటీ గణిత శాస్త్ర ఉపాధ్యాయుని (హెచ్‌బీటీ) పోస్టును అత్యవసరంగా భర్తీ చేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. దీనా తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎం.ఎస్సీ (మ్యాథమెటిక్స్), బి.ఎడ్ పూర్తి చేసి, టెట్ అర్హత కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు. గణిత శాస్త్ర బోధనలో అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థుల ఎంపిక కోసం ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణలో డెమో క్లాస్‌తో పాటు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధృవపత్రాలు, జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అంకితభావంతో పనిచేసే అర్హులైన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యా యురాలు ఎం. దీనా కోరారు.

**ముఖ్య వివరాలు**

పోస్టు: పీజీటీ గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు (హెచ్‌బీటీ)
అర్హతలు: ఎం.ఎస్సీ (మ్యాథమెటిక్స్), బి.ఎడ్, టీఈటీ
డెమో క్లాస్, ఇంటర్వ్యూ: 17-06-2026
సమయం: ఉదయం 10:00 గంటలకు
స్థలం: తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ, పోతులబోగుడ, వట్పల్లి మండలం, సంగారెడ్డి జిల్లా

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**-పాతికేళ్ల తర్వాత గురువులతో కలయిక..**

**మంగంపేట్ జడ్పీ ఉన్నత పాఠశాల 2000-2001 బ్యాచ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు.**

**జిన్నారం/ప్రజాజ్యోతి (జూన్15)** దాదాపు పాతికేళ్ల తర్వాత తమ బాల్య స్నేహితులు, చదువు చెప్పిన గురువులను ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధులు లేకపోయాయి. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, గురువుల ఆశీస్సులు పొందుతూ మంగంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-2001 విద్యా సంవత్సరం విద్యార్థులు నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి.పటాన్ చెరు శివారులోని ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో జరిగిన ఈ కార్యక్రమం ఆప్యాయత, అనుబంధాలకు ప్రతీకగా నిలిచింది. దాదాపు 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న సహాధ్యాయులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. పాఠశాల రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, తరగతి గదుల అనుభవాలు, క్రీడా పోటీలు, వార్షికోత్సవాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. కొందరు తమ వద్ద భద్రపరచుకున్న పాత ఫొటోలను చూపించుకుంటూ ఆ రోజుల మధుర క్షణాలను మరోసారి ఆస్వాదించారు. ఈ సందర్భంగా తమ జీవితాలకు బాటలు వేసిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. గురువుల పట్ల తమకున్న గౌరవం, ప్రేమను చాటుకుంటూ వారి ఆశీస్సులు పొందారు. పూర్వ విద్యార్థులలో పలువురు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవడం గురువులకు ఆనందాన్ని కలిగించింది, వివిధ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న తమ శిష్యులను చూసి ఉపాధ్యాయులు గర్వం వ్యక్తం చేశారు. "విద్యార్థుల విజయమే గురువులకు నిజమైన గౌరవం" అని పేర్కొంటూ, జీవితంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని



ఆశీర్వదించారు. విద్యార్థి దశలో గురువులు అందించిన మార్గదర్శకత్వం తమ జీవితాన్ని తీర్చిదిద్దిందని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. క్రమశిక్షణ, విలువలు, సమాజపట్ల బాధ్యత వంటి అంశాలను గురువుల నుంచే నేర్చుకున్నామని గుర్తు చేసుకున్నారు. తమపై గురువుల ప్రేమాభిమానాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ, భవిష్యత్తులో కూడా ఇటువంటి సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించారు. సుమారు 20 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్న ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆత్మీయతకు, గురు-శిష్య, బంధానికి ప్రతీకగా నిలిచాయి. పాతికేళ్ల తర్వాత కలుసుకున్న ఈ కలయిక అందరి హృదయాలను హత్తుకుని, మరపురాని అనుభూతులను మిగిల్చిందని గురువుల ఆశీస్సులు, స్నేహితుల అనుబంధాలు జీవితాంతం తమతోనే ఉంటాయని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.

# భూతల్లిని ఆరాధించండి..!





**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి**

**దత్తగిరి పీఠాధిపతి అవధూతగిరి పిలుపు**

**ముగిసిన 16 సోమవారాల వ్రతం**

**వైభవంగా రుద్రయజ్ఞం, పూర్ణాహుతి**

**జహీరాబాద్, జూన్ 15(ప్రజా జ్యోతి న్యూస్)** "భూమాత మనందరికీ తల్లి ఆమె ఒడిలోనే జన్మిస్తాం, ఆమె సంపదతోనే జీవిస్తాం, చివరకు ఆమె ఒడిలోనే విశ్రాంతి పొందుతాం. భూమిని ప్రేమించడం, పరిరక్షించడం ప్రతి మనిషి ధర్మం. ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి భూతల్లికి సేవ చేయాలి" అని సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్ పిలుపునిచ్చారు. సోమవారం షోడశ (16) సోమవారాల వ్రతం ముగింపు సందర్భంగా ఆశ్రమ మాతృ మూర్తులు ఆనందగిరి, నందినిగిరి చేపట్టిన వ్రతానికి సమాప్తి నిర్వహించారు. ఈ సందర్భంగా 16 పార్థివ లింగాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ, గణపతి, గౌరీ పూజ, అగ్నిగుండ ప్రవేశం, రుద్రసహిత నారాయణ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తగిరి ఆశ్రమ వేదమంత్రా లతో ప్రతిధ్వనించింది. అనంతరం మహిళా మూర్తులకు వాయినాలు ఇచ్చారు. పరిసరా లు జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, బీదర్, మొగుడంపల్లి, కోహీర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాము లయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన నిర్వహించారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలి.





-మొదటిపేజీ తరువాయి

బాధితులకు అండగా నిలవాలని అన్నారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. అలాగే, నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచాలని తెలిపారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలన్నారు. అనంతరం సిబ్బంది కిట్ బ్యాగ్‌లను తనిఖీ చేస్తూ, అందులోని ప్రతి వస్తువు విధి నిర్వహణలో ఉపయోగపడుతుందని, వాటిని జాగ్రత్తగా సంరక్షించి వినియోగించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరూ నీట్ టర్న్‌అవుట్‌ను నిర్వహిస్తూ, ప్రతిరోజూ వ్యాయామం చేసి శారీరక దృఢత్వాన్ని (ఫిట్‌నెస్‌ను) మెరుగుపరచుకోవాలని సూచించారు ప్రజలకు సులభంగా, పారదర్శకంగా పోలీసు సేవలు అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓపికగా విని, వారి సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసా కల్పించాలని అన్నారు ఈ తనిఖీలోసంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, మహిళా పోలీసు స్టేషన్ ఎస్.హెచ్.ఓ మహేష్ గౌడ్, సిసిఎస్ ఇన్స్పెక్టర్స్, శివ కుమార్, ప్రసాద్ రావ్, ఎస్ఐ మాణిక్ రెడ్డి, మహిళా ఎస్ఐ పూల భాయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ పాఠశాల విద్యార్థులకు ఆత్మీయ ఆహ్వానం






## విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన నూతన విద్యా సంవత్సరం

### ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జూన్ 15:** 2026–27 విద్యా సంవత్సరానికి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆత్మీయ స్వాగతం పలికారు. పాఠశాలకు వచ్చిన చిన్నారులను ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్యతో పాటు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి నూతన విద్యా సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కొత్త పుస్తకాలను అందుకున్న విద్యార్థులు ఆనందోత్సాహాలతో విద్యాభ్యాసాన్ని ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య మాట్లాడుతూ, విద్యే భవిష్యత్తును నిర్మించే బలమైన ఆయుధమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాల సాధించిన విశిష్ట విజయాలను కొనసాగిస్తూ, ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు,



తల్లిదండ్రులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఇతర ప్రతిభా వేదికలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. నూతన విద్యా సంవత్సరం తొలి రోజే పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సందడి, ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మంచిర్యాల తాండాలో సహారా ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

### మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో గ్రామంలో వైద్య సేవలు



**అందోలు, జూన్ 15, (ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మంచిర్యాల తాండాలో సోమవారం సహారా హెల్త్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రామావత్ జ్యోతి మోహన్ అధ్యక్షతన, డాక్టర్ మధుసూదన్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి తాండా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరం పేదలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా తాండా ప్రజలు మాట్లాడుతూ.. చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లి అధిక ఖర్చులు భరించాల్సిన అవసరం లేకుండా తమ గ్రామంలోనే వైద్య సేవలు అందడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు సర్పంచ్ జ్యోతి మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు మాట్లాడుతూ.. వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజమంతా ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయాన్ని గుర్తించి ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వట్పల్లి సర్పంచ్ రవీందర్, వీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వినయ్ గౌడ్, వెంకట్ పాటిల్, శంకరప్ప, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాల పంపిణీతో ప్రారంభమైన నూతన విద్యా సంవత్సరం



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూన్ 15:** వేసవి సెలవుల అనంతరం ఈరోజు తూప్రాన్ ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ రాథోడ్ నాయక్, రావెల్లి మాజీ సర్పంచ్ వెంకటేష్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# రాయన్‌పల్లి ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలి

**మెదక్ :** గతేడాది భారీ వర్షాలకు దెబ్బతిన్న రాయన్‌పల్లి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించడంపై మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి మండిపడ్డారు. మెదక్ జిల్లాలోని రాయన్‌పల్లి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలని సోమవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు, రైతులతో కలసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులపై నిర్లక్ష్యం వహిస్తున్నదని, దీంతో సాగునీరు అందుకు రైతులు పంటలు సాగుచేసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది మెదక్‌లో భారీ వర్షాలు కురవడంతో రాయన్‌పల్లి ప్రాజెక్టు తూము, అలుగులు, సాగునీటి కాల్వలు దెబ్బతిన్నాయని తెలిపారు. గతేడాది తాత్కాలిక మరమ్మతులు చేసుకుని పంటలు పండించుకున్నట్లు గుర్తుచేశారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనా ప్రభుత్వం ఇంతవరకు ప్రాజెక్టుకు మరమ్మతులు చేయడం లేదన్నారు. మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు చేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి, రైతులకు సాగునీరందేందుకు చర్యలు తీసుకోవాలని పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ రాయన్‌పల్లి ప్రాజెక్టును పరిశీలించి, మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. రాయన్‌పల్లి ప్రాజెక్టు కింద 2500 ఎకరాలకు ఆయకట్టు ఉందన్నారు. మరమ్మతులు చేయకపోతే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల్లోగా మరమ్మతులు పూర్తి చేయకపోతే వాననీరు వృథాగా బయటకు పోయే ప్రమాదం ఉందన్నారు. వానకాలం రాకముందే మరమ్మతులు చేయాలని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా, ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని ప్రాజెక్టుకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**భారీగా తరలివచ్చిన రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు**

మెదక్ కలెక్టరేట్ గేట్ ఎదుట సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు, రైతులు భారీగా తరలివచ్చారు. మెదక్ మండలంలోని తిమ్మానగర్, మక్తభూపతిపూర్, గుట్టకిందిపల్లి, శివాయపల్లి, మల్కాపూర్ తండా, వెంకటపూర్, కొంటూర్‌కు చెందిన రైతులు భారీగా తరలివచ్చారు. రైతులు, బీఆర్ఎస్ నాయకులు కలెక్టరేట్ వద్దకు చేరుకుని, కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా, కలెక్టరేట్‌లోనికి వెళ్లేందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. చివరకు జిల్లా అధికారుల అనుమతితో ప్రజావాణిలో కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టును పరిశీలించి మరమ్మతులు చేయించాలని కలెక్టర్‌ను కోరారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బట్టి జగపతి, మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిం డ్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు అంజాగౌడ్, మా జీ ఎంపీపీ కిష్టయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, మాయ మల్లే శం, ఆర్కే శ్రీనివాస్, కిశోర్, ఇందాద్, మేకల సాయిల్, సాప సాయిల్, చెన్నాగౌడ్, సాయాగౌడ్, రాజేశ్వర్‌రా వు, నరేందర్‌రెడ్డి, శ్రీనునాయక్, గురుమూర్తి గౌడ్ పాల్గొన్నారు.

# కొత్త బొగ్గు గనులు తీసుకొస్తే లక్షకు ఉద్యోగాలు వస్తాయి: కల్వకుంట్ల కవిత

**మంచిర్యాల :** తెలంగాణ రక్షణ సేన చేపట్టిన "బొగ్గుబాయి" కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మైన్–1ను సందర్శించారు. అక్కడ సింగరేణి కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన గేటు మీటింగ్‌లో ఆమె రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాంతాలకు వచ్చి వినతిపత్రాలు ఇస్తూ కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.కార్మికులకు హక్కుగా రావాల్సిన డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త బొగ్గు గనులు తీసుకొస్తే లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు సృష్టించవచ్చని, కానీ ప్రభుత్వం అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను మూసివేసి ఓపెన్ కాస్ట్‌లను పెంచుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సంస్థకు బకాయి ఉన్న రూ. 50 వేల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ ముట్టడి తర్వాతే నెలకు రెండుసార్లు జరగాల్సిన మెడికల్ బోర్డులను నిర్వహించే పరిస్థితి వచ్చిందన్నారు. కార్మికుల హక్కుల కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ సంయుక్తంగా పోరాడుతాయని కవిత ప్రకటించారు. ఈ ఐక్యత రానున్న ఎన్నికల్లోనూ కొనసాగుతుందని, కార్మికుల కోసం హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ రాజీలేని పోరాటం చేస్తున్నారని కొనియాడారు.

# కంటోన్మెంట్లో రూ. 800 కోట్ల విలువైన 8 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి



**హైదరాబాద్ :** సోమవారం నాడు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలని బీఆర్ఎస్ నేతలు కలిసారు. కంటోన్మెంట్ తిరుమలగిరి మండలం తొకట్ట సర్వే నంబర్ 157/1లో ఉన్న 8 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతూ సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిషాంక్ మాట్లాడుతూ ఈ భూమి చారిత్రాత్మకంగా "పోరంబోకు సర్కారీ" ప్రభుత్వ భూమిగా గుర్తించబడిందని, 1955 నుండి ఉన్న రికార్డులు, 1975–76 భూ ఆక్రమణ చట్టం కింద జరిగిన చర్యలు, అలాగే పలు న్యాయపరమైన విచారణలు ప్రభుత్వ హక్కులను నిరంతరం సమర్థించాయని వెల్లడించారు. ఎనిమిది ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించబడింది మరియు దశాబ్దాలుగా న్యాయపరమైన, పరిపాలనా ప్రక్రియలకు లోబడి ఉంది. ఈ భూమిపై ప్రైవేట్ వ్యక్తుల హక్కుల వాదనలను కోర్టులు మరియు రెవెన్యూ అధికారులు పలుమార్లు తిరస్కరించారు. 2025లో కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే గణేష్ మరియు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇదే భూమిలో 6000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనలో ఈ భూమిని ప్రభుత్వ భూమిగా పరిగణించారు. అయితే ప్రస్తుతం ఈ భూమి ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లినట్లు, చుట్టూ ప్రహరీ నిర్మించబడినట్లు సమాచారం రావడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు. దాదాపు రూ.800 కోట్ల విలువైన ప్రజా ఆస్తి, ప్రభుత్వ హక్కులు పదేపదే గుర్తించబడినప్పటికీ, ఎలా ప్రైవేట్ ఆధీనంలోకి వెళ్లింది. భూమి హక్కులు, సరిహద్దులు, స్వాధీనం మరియు ప్రస్తుత స్థితిపై తక్షణ విచారణ చేపట్టాలి. రెవెన్యూ, సర్వే మరియు న్యాయపరమైన చారిత్రక రికార్డులను పరిశీలించాలి. రెవెన్యూ, సర్వే మరియు న్యాయ శాఖలతో సంయుక్త ధృవీకరణ నిర్వహించాలని కలెక్టర్ను క్రిషాంక్ కోరారు.